24న జై భారత్ సత్యాగ్రహ సభ

శ్రీకాకుళం అర్బన్ : ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యాన ఈనెల 24న విజయవాడలో జై భారత్ సత్యాగ్రహ సభను నిర్వహిస్తున్నట్లు డిసిసి జిల్లా సమన్వయకర్త డోల శ్రీను తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. డిసిసి అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి అధ్యక్షతన నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభకు ప్రతి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. వీలైనంత ఎక్కువ మంది హాజరయ్యేలా నాయకులు చూడాలని చెప్పారు. అనంతరం జై భారత్ సత్యాగ్రహ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సనపల అన్నాజీరావు, పేడాడ పరమేశ్వరరావు, దేశెళ్ల గోవింద మల్లిబాబు, చింతాడ దిలీప్, పైడి నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

మాట వినకుంటే వేటే

- డిఎస్‌సి-98 పోస్టింగ్‌లపై ఇద్దరు అమాత్యుల సిఫార్సు
- నిబంధనలకు విరుద్ధమని అంగీకరించని డిఇఒ పగడాలమ్మ
- టెక్కలి డిప్యూటీ డిఇఒగా బదిలీ
- నాడు అరుణకుమారి... నేడు పగడాలమ్మ

శాసనసభ్యునిగా నా కర్తవ్యాలను శ్రద్ధతో, అంత:కరణ శుద్ధితో నిర్వహిస్తానని, భయం గానీ పక్షపాతం గానీ రాగ ద్వేషాలు గానీ లేకుండా, రాజ్యాంగాన్ని శాసనాలను అనుసరించి ప్రజలందరికీ న్యాయం చేకూరుస్తానని దైవ సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను. ఇదీ ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత చేసే ప్రమాణ స్వీకారం లోని కొన్ని వాక్యాలు. ఇలా ప్రమాణం చేసిన అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కొందరు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. బదిలీలు, పోస్టింగ్‌ల విషయంలో ఆశ్రిత పక్షపాతం, బంధుప్రీతికి తలొగ్గుతున్నారు. ఆ క్రమంలో మాట వినని అధికారులపై వేటు వేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధమని తెలిసినా తాము చెప్పిన పనిచేయలేదని జిల్లా విద్యాశాఖాధికారిగా పనిచేసిన గార పగడాలమ్మను సాగనంపడం విద్యాశాఖ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లా విద్యాశాఖ అధికారిగా గార పగడాలమ్మ ఏడాదికి పైగా పూర్తి అదనపు బాధ్యతలతో విధులు నిర్వరిస్తున్నారు. అంతకుముందు టెక్కలి రెగ్యులర్ డిప్యూటీ డిఇఒగా పనిచేసిన తర్వాత డిఇఒగా ఎఫ్‌ఎసి బాధ్యతలు అప్పగించారు. జూనియర్ అసిస్టెంట్ నుంచి డిఇఒగా అంచెలంచెలుగా ఎదిగిన ఆమె ఇప్పుడిప్పుడే విద్యాశాఖ వ్యవహారాలపై పట్టు సాధిస్తున్నారు. డిఇఒగా ఇక ఆమె కొంతకాలం పాటు చేస్తారని అంతా అనుకుంటున్న సమయంలో ఆకస్మికంగా బదిలీ కావడం తీవ్ర చర్చనీయాంశమైంది. రాజకీయ కారణాలతోనే ఆమె బదిలీ జరిగినట్లు ప్రచారం సాగుతోంది. డిఎస్‌సి-98 అంశమే ఆమె బదిలీకి దారితీసిందన్న చర్చ నడుస్తోంది. డిఎస్‌సిలో ఎంపికైన ముగ్గురు మహిళలకు శ్రీకాకుళం మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలల్లో పోసింగ్ ఇవ్వాలని జిల్లాకు చెందిన ఓ అమాత్యునితో పాటు పొరుగు జిల్లాకు చెందిన మరో మంత్రి సిఫార్సు లేఖలను పంపినట్లు తెలిసింది. డిఎస్‌సి-98 నోటిఫికేషన్ వెలువరించిన నాటికి మున్సిపాలిటీ పరిధిలోని స్కూళ్లలో పోస్టులు ఖాళీగా లేవని తెలిసింది. ఆ పోస్టుల్లో డిఎస్‌సి అభ్యర్థులను నియమించడం నిబంధనలు ఉల్లంఘించడమే అవుతుందని గుర్తించిన ఆమె, మంత్రులు పంపిన లేఖలను పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు పంపినట్లు తెలిసింది. దీంతో ఆగ్రహించిన ఇరువురు మంత్రులు ఆమెను ఉన్నఫళంగా బదిలీ చేసి టెక్కలి డిప్యూటీ డిఇఒగా పంపినట్లు చర్చ నడుస్తోంది.

బదిలీకైనా సిద్ధపడ్డారు

గిరిజన కుటుంబాల్లో చదువుకున్న వారే తక్కువ. అందులోనూ ఉద్యోగాలు చేసిన వారి సంఖ్య మరీ స్వల్పం. ప్రభుత్వ శాఖల్లో జిల్లాస్థాయి అధికారి అందులోనూ మహిళలు ఆ స్థాయి వరకు వెళ్లడమంటే గొప్పగానే భావించాలి. అధికార పార్టీ నేతలకు అవన్నీ అనవసరంగానే భావించారు. తాము చెప్పిన పని చేయలేదనే ఒక్క విషయాన్ని పరిగణనలోకి తీసుకున్నారు. అంతిమంగా గిరిజన కుటుంబం నుంచి అంచెలంచెలుగా ఎదిగిన గార పగడాలమ్మను మళ్లీ డిప్యూటీ డిఇఒ ఉద్యోగానికి సాగనంపారు. బదిలీకైనా సిద్ధపడ్డారు గానీ నిబంధనలకు విరుద్ధంగా పనిచేయలేని తెగేసి చెప్పడంపై అంతా ఆమెను ప్రశంసిస్తున్నారు.

కొత్త డిఇఒతో తప్పు చేయిస్తారా?

తాము చెప్పిన మాట వినలేదని పగడాలమ్మను బదిలీ చేయించిన ఇరువురు మంత్రులు ఆమె స్థానంలో శ్రీకాకుళం డిప్యూటీ డిఇఒ, వమరవెల్లి డైట్ లెక్చరర్‌గా బాధ్యతలను నిర్వరిస్తున్న తిరుమల చైతన్యను డిఇఒగా నియమించారు. ఇరువురు మంత్రులు ఇప్పుడు తమకు కావాల్సిన పనిని కొత్త డిఇఒతో చేయించుకుంటారా?, చేసేందుకు తిరుమల చైతన్య అంగీకరిస్తారా అన్నది వేచి చూడాలి. డిఎస్‌సి-98లో ఎంపికైన వారికి శ్రీకాకుళం మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలల్లో పోస్టింగ్‌లు ఇస్తే నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించనట్లేనని విద్యాశాఖలో చర్చ నడుస్తోంది.

అప్పుడు అలా... ఇప్పుడు ఇలా...

గతంలో డిఇఒగా పనిచేసిన అరుణకుమారి బదిలీ విషయంలో చోటుచేసుకున్న పరిణామాలే మళ్లీ పునరావృతమయ్యాయి. నాడు టిడిపి ప్రభుత్వ హయాంలో కార్మికశాఖ మంత్రిగా ఉన్న కింజరాపు అచ్చెన్నాయుడు అరుణకుమారిని అన్యాయంగా బదిలీ చేశారనే ప్రచారం సాగింది.

ఇప్పుడు వైసిపి ప్రభుత్వంలో ఉన్న ఇద్దరు మంత్రులు పగడాలమ్మను సాగనంపారని చర్చ నడుస్తోంది. 2015 మార్చిలో పోలాకి చెందిన ఓ జూనియర్ ప్రధానోపాధ్యాయుడిని ఎంఇఒగా నియమించాలని అచ్చెన్నాయుడు చేసిన సిఫార్సును అప్పటి డిఇఒ అరుణకుమారిని కాదన్నారని పదో తరగతి పరీక్షల చివరి రోజుల్లో ఆకస్మికంగా బదిలీ చేశారు. అప్పుడు, ఇప్పుడూ ఇద్దరూ మహిళలే కావడం గమనార్హం.

ఎంపీ రామ్మోహన్ నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న పెన్షనర్లు

కనీస పెన్షన్‌కు కేంద్రంపై ఒత్తిడి

- ఎంపీని కోరిన ఇపిఎస్ పెన్షనర్లు
- ప్రజా సదన్ వద్ద భిక్షాటనతో ఆందోళన
- పెన్షనర్ల సమస్యలపై పార్లమెంట్‌లో పోరాటం : ఎంపీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఇపిఎస్-95 కనీస పెన్షన్‌ను రూ.తొమ్మిది వేలకు పెంచాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా కోఆర్డినేషన్ కమిటీ పిలుపుమేరకు ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్‌పర్సన్స్ అసోసియేషన్ ఇపిఎస్ పెన్షనర్లు శ్రీకాకుళం నగరంలోని ప్రజా సదన్ వద్ద భిక్షాటన శిబిరాన్ని గురువారం నిర్వహించారు. శిబిరాన్ని ఎంపీ రామ్మోహన్ నాయుడు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఆయనకు అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందజేసి సమస్యలను వివరించారు. ఇపిఎస్-95 విధానం లోపభూయిష్టంగా ఉందని, పరిశీలించి మార్పు చేస్తామని కేంద్ర ప్రభుత్వం గతంలో ప్రకటించినా నేటికీ ఆ హామీని నెరవేర్చలేదన్నారు. 180 సంస్థల్లో పనిచేసిన ఇపిఎస్-95 పెన్షనర్లు దేశంలో 73 లక్షల మంది ఉన్నారని, వీరికి కేవలం రూ.వెయ్యి నుంచి రూ.రెండు వేల లోపు పెన్షన్ వస్తోందని తెలిపారు. వచ్చే పెన్షన్‌తో గ్యాస్ సిలిండర్ కూడా రావడం లేదన్నారు. వృద్ధాప్యంలో వైద్య ఖర్చులకూ డబ్బులు సరిపోక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారున్నారని వివరించారు. కనీస పెన్షన్‌పై కేరళ హైకోర్టు, సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులను కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. కనీస పెన్షన్ రూ.9వేలు, కరువు భత్యం, ఉచిత వైద్య సదుపాయం, సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి హయ్యర్ పెన్షన్ చెల్లించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెన్షనర్లకు రైల్వే రాయితీలు కల్పించాలన్నారు. తమ సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

పెన్షనర్ల సమస్యలపై పార్లమెంట్‌లో పోరాటం

దీనిపై ఎంపీ స్పందిస్తూ ఇపిఎఫ్ పెన్షనర్ల సమస్యలపై గతంలో పార్లమెంట్‌లో ప్రస్తావించడంతో పాటు కేంద్ర ఆర్థికశాఖ మంత్రికి లేఖ రాశానన్నారు. కనీస పెన్షన్ ఇచ్చే ఆర్థిక స్తోమత ఉన్నా కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చొరవ చూపడం లేదని చెప్పారు. ఇపిఎస్ పెన్షనర్లకు న్యాయం చేయడానికి రాజకీయాలకతీతంగా అన్ని పార్టీలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పెన్షనర్ల సమస్యలను మిగతా ఎంపీలకు వివరించి వారి సహకారంతో పార్లమెంట్‌లో పోరాడతానన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు లీలా అనంతరావు, నీలకంఠం శ్రీనివాసరావు, నర్సింహులు, చంద్రశేఖర్, వాసుదేవరావు, నారాయణరావు, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

మూలపేట పోర్టు ఎన్నికల డ్రామా

- ఆమదాలవలస రోడ్డే బాగు చేయలేకపోయారు
- కబ్జాల కోసమే సిఎం విశాఖలో కాపురం
- ఎంపీ రామ్మోహన్ నాయుడు

మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల డ్రామాలో భాగంగానే మూలపేట పోర్టుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శంకుస్థాపన చేశారని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు విమర్శించారు. నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద గురువారం విలేకరులతో మాట్లాడుతూ పోర్టు నిర్మాణానికి టిడిపి హయాంలోనే భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చినట్లు గుర్తుచేశారు. ఈ నాలుగేళ్లలో పోర్టుకు అతీగతి లేకుండా పోయిందని, ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో శంకుస్థాపన చేశారని చెప్పారు. ఇదంతా ఎన్నికల ముందు ఆడుతున్న జగన్నాటకంగా అభివర్ణించారు. రద్దీ ఎక్కువగా ఉండే శ్రీకాకుళం-ఆమదాలవలస మధ్య పాడైన పది కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణ పనులే పూర్తి చేయలేని వారు పోర్టును నిర్మిస్తామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి టిడిపి ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఆ తర్వాత అధికారంలోకొచ్చిన వైసిపి, ఆ రోడ్డుకు మరమ్మతులూ చేపట్టలేకపోయిందని ఎద్దేవా చేశారు. జగన్ హామీలు పేపరుపై రాసుకోవడానికి తప్ప ఒక్క రూపాయి రావడం లేదన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు శంకుస్థాపన డ్రామానూ రేపోమాపో మొదలుపెడతారని విమర్శించారు. జగన్ చెప్తున్న విశాఖ రాజధానిని ప్రజలు విశ్వసించడం లేదన్నారు. తనకేం లేదని చెప్తున్న జగన్, దేశంలోనే ధనిక ముఖ్యమంత్రుల్లో మొదటి స్థానంలో ఉన్నారని తెలిపారు. సూట్‌కేసు కంపెనీలు, ఇసుక, మద్యం, ఇతర కాంట్రాక్టుల్లో దోచుకుని దాచుకున్న సొమ్ముకు లెక్క లేదని ఆరోపించారు. జగన్ అక్రమార్జనతో నెలకో వసతి దీవెన ఇవ్వవచ్చని వ్యాఖ్యానించారు. గత ఎన్నికల ముందు కోడి కత్తి డ్రామా ఆడిన జగన్, ఇప్పుడు ఎన్ఐఎ విచారణకు ఎందుకు ముఖం చాటేస్తున్నారని ప్రశ్నించారు.

ప్రతి సమావేశంలో ఒంటరివాడినని చెప్తున్న జగన్ తల్లిని, చెల్లిని ఎలా తరిమేశారో ప్రజలకు అర్థమైందన్నారు. బాబాయ్ వివేకా హత్య కేసుకు సంబంధించి ఆయన కుమార్తె సునీత ఎవరిపై పోరాడుతుందో అందరికీ తెలుసునన్నారు. నాలుగేళ్లుగా ఎక్కడా ఒక్క అభివృద్ధి పని చేయకుండా ఇప్పుడు ఇంటికో స్టిక్కర్‌తో రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. విభజన హామీలు, ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు, పోలవరం, విశాఖ ఉక్కు గురించి జగన్ ఏనాడూ ఢిల్లీ వెళ్లి మాట్లాడిన సందర్భం లేదన్నారు. బాబాయ్ హత్య కేసులో సిబిఐ కేసు నుంచి తనవారిని బయటకు తీసుకొచ్చేందుకు నెలలో మూడుసార్లు ఢిల్లీ వెళ్లారని ఆరోపించారు. ఢిల్లీలో పెద్దలతో ఏం మాట్లాడారో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. విశాఖలో సిఎం కాపురం అంటే కబ్జాల కోసమేనని ఆరోపించారు. మూడు రాజధానులు ముగిసిన అంశమని, ప్రజలు కూడా మరిచిపోయారని చెప్పారు. దివాళా తీసిన రాష్ట్రాన్ని చంద్రబాబే బాగు చేయగలరని ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. ఆయనతో పాటు మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ తదితరులున్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

అచ్చెన్నాయుడుకు మంత్రి అప్పలరాజు సవాల్

ప్రజాశక్తి - పలాస

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై అదే పనిగా అసత్య ప్రచారం చేస్తున్న టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు... టిడిపి హయాంలో, నాలుగేళ్ల వైసిపి పాలనలో చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు సవాల్ విసిరారు. కాశీబుగ్గలోని ప్రగతిభవన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు హయాంలో ఉత్తరాంధ్ర అభివృద్ధికి చేసిందేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు ఒక్క పోర్టుకు గానీ, హార్బర్‌కు గానీ కనీసం శంకుస్థాపన చేసినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని, చంద్రబాబు కనీసం ఆ ఆలోచన కూడా చేయలేకపోయారని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయినా రాష్ట్రం మొత్తమ్మీద నాలుగు ప్రాంతాల్లో 6 పోర్టులు మాత్రమే ఉండేవని, వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 46 నెలల కాలంలో మరో నాలుగు పోర్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. సంతబొమ్మాళి మండలం మూలపేటలో 24 మిలియన్ టన్నుల సామర్థ్యంతో, నాలుగు బెర్తులతో నిర్మించనున్న పోర్టుతో వేల సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఎగుమతులు, దిగుమతులతో పోర్టు ఆధారిత అనుబంధ పరిశ్రమలు ఏర్పడతాయన్నారు. ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం తీరంలో రూ.365.81 కోట్లతో ఫిషింగ్ హార్బర్‌తో పాటు వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేట వద్ద ఫిష్ లాండింగ్ సెంటర్‌ను ఫిషింగ్ హార్బర్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రకటించడంపై ఈ ప్రాంత మత్స్యకారుల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కవిటి మండలం ఇద్దివానిపాలెం వద్ద మరో ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌ను ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇవన్నీ పూర్తయితే జిల్లా నుంచి మత్స్యకారుల వలసలు అన్న మాటే వినిపించదన్నారు.

మహేంద్రతనయ నదిపై ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. నేరడి బ్యారేజీ నిర్మాణానికి పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో రైతులకు మంచి జరగాలన్న ఉద్దేశంతో రూ.176 కోట్లతో గొట్టాబ్యారేజీపై ఎత్తిపోతల పథకం నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. దీంతో జిల్లా రైతాంగానికి రెండు పంటలు పండించుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు. కిడ్నీ సమస్యకు కలుషిత నీరు కూడా కారణం కావడంతో ఉపరితల జలాలను అందించేందుకు రూ.700 కోట్లతో మంచినీటి పథకాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. పాతపట్నం నియోజకవర్గంలోని మూడు మండలాలకు రూ.265 కోట్లతో ఉద్దానం నీటి పథకాన్ని విస్తరించనున్నట్లు వివరించారు. అభివృద్ధి అంటే ఇది అని, ఇటువంటి అభివృద్ధి కోసమే జిల్లా ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని చెప్పారు. ఆ ఎదురుచూపులు ఇన్నాళ్లకు ఫలించాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌పై అచ్చెన్నాయుడు లేనిపోని ఆరోపణలు చేస్తే సహించేది లేదని, నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టెక్కలిలో అచ్చెన్నాయుడు ఓటమి ఖాయమన్నారు. దువ్వాడ శ్రీనివాస్ గెలుపునకు సమిష్టిగా పనిచేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల ఆస్పత్రి వద్ద జగన్ మాస్కుతో సెల్ఫీ తీసుకున్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, ఎఎంసి చైర్మన్ పి.వి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ రీసెర్చ్ సెంటర్ వద్ద సెల్ఫీ తీసుకుంటున్న మంత్రి అప్పలరాజు

సచివాలయాలతో ప్రజల ముంగిటకు సేవలు

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

సచివాలయాలతో ప్రజల ముంగిటకు సేవలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కిందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి, డిఎంహెచ్ఒ, వ్యవసాయశాఖ జెడి తదితర జిల్లాస్థాయి అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల సేవలకు ప్రజల నుంచి విశేషమైన ఆదరణ లభిస్తున్నదని అన్నారు. సరుబుజ్జిలి మండలంలోని గోనెపాడు, యరగాం గ్రామాలు సుదూర ప్రాంతాల్లో ఉండడం వల్ల అక్కడి ప్రజలు సచివాలయ సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేక ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై రాష్ట్ర ఉన్నతాధికారులతో చర్చించానని, ఆ గ్రామాలకు పూర్తిస్థాయిలో సచివాలయ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడతానని హామీనిచ్చారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు పూర్తిస్థాయిలో సేవలు అందుతున్నాయని, ఈ సేవలను మరింత విస్తృతపరిచేలా జిల్లా వ్యవసాయశాఖ అధికారులు కృషి చేయాలని సూచించారు. వెల్‌నెస్ సెంటర్ల ద్వారా గ్రామస్థాయిలో ప్రాథమిక వైద్యం ప్రజలకు చేరువైందని చెప్పారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు. గ్రామ సచివాలయాల పరిధిలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని డిపిఒకు సూచించారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలో ప్రతి శాఖకు సంబంధించిన సేవలను ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. జల్ జీవన్ మిషన్ ద్వారా నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో ఇప్పటివరకు శాఖల వారీగా చేపట్టిన అభివద్ధి పనులు వాటి పురోగతి వంటి అంశాలపై జిల్లా అధికారులతో సమీక్షించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, జిల్లాపరిషత్ సిఇఒ ఆర్.వెంకట్రామన్, వ్యవసాయ శాఖ జెడి శ్రీధర్, బిసి వెల్ఫేర్ ఇడి గడ్డెమ్మ, సరుబుజ్జిలి జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవీన్

రంజాన్ పండగ మత సామరస్యానికి ప్రతీక అని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యాన నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో గురువారం ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన, క్రమశిక్షణ, దాతృత్వానికి రంజాన్ మాసం దోహదపడుతుందన్నారు. ఉపవాస దీక్షలు, ప్రార్థనలు సోదరభావం, ప్రేమను పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డిటి షరీఫ్‌ని జెసి సన్మానించారు. తొలుత రంజాన్ మాసం విశిష్టతను పలువురు వివరించారు. అనంతరం ఇఫ్తార్ విందు చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి లావణ్య, కళింగ వైశ్య కార్పొరేషన్ అంధవరపు సూరిబాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం.వి పద్మావతి, ఎం.ఎ రఫీ, సిరాజుదిన్, పలు మసీదుల కమిటీ అధ్యక్షులు, ముస్లిం మత పెద్దలు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

రెండు పూటలా పనిచేయాలి

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

ఎచ్చెర్ల : ఉపాధి హామీ కూలీలు రెండు పూటలా పనులు చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి చిట్టిరాజు స్పష్టం చేశారు. ఎచ్చెర్ల మండలం ముద్దాడ, పొన్నాడ పంచాయతీల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను గురువారం పరిశీలించారు. కూలీలకు ఒఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు కనీసం ఆరు గంటల సమయం పనిచేస్తే గరిష్ట కూలి రూ.272 వస్తుందన్నారు. కూలీలందరూ సమయపాలన పాటించాలని చెప్పారు. కూలీలకు పూర్తిస్థాయిలో ఉపాధి కల్పించేందుకు గానూ అవసరమైన మేర కొత్త పనులను గుర్తించి అంచనాలను తక్షణమే వేసి కార్యాలయానికి పంపించాలన్నారు. కూలీలు రెండు పూటలా చల్లని సమయాల్లో ఉపాధి పనులు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపిడి కె.లోకేష్, ఎపిఒ శోభారాణి, ఇసి నారాయణమ్మ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీ రుణాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - పలాస

సమావేశంలో మాట్లాడుతున్న మన్మయ పండాబ్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలను పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా విశాఖపట్నం డిప్యూటీ జనరల్ మేనేజర్ మన్మయ పండాబ్ కోరారు. కాశీబుగ్గలోని ఒక ఫంక్షన్ హాల్‌లో ఎస్‌బిఐ పలాస బ్రాంచ్ మేనేజర్ జి.బాబూరావు అధ్యక్షతన బ్యాంకు ఖాతాదారులు, పరిశ్రమల యజమానులకు బ్యాంకు రుణాలపై గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.రెండు కోట్ల రుణంతో రైస్‌మిల్లులు, జీడి పరిశ్రమ నెలకొల్పితే రూ.10 లక్షలు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. రీజియన్ పరిధిలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.622 కోట్ల రుణాలు లక్ష్యం కాగా, రూ.595 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. పలాస పిసిఎంఎ అధ్యక్షులు మల్లా సురేష్ మాట్లాడుతూ 2018 తిత్లీ తుపాను సమయంలో జీడి వ్యాపారులతోపాటు జీడి రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. జీడి రైతులకు బ్యాంకు ద్వారా జీడి మొక్కలను పంపిణీ చేస్తే అటు రైతులకు, ఇటు వ్యాపారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పలాసలో 300 జీడి పరిశ్రమలకు గానూ 95 పరిశ్రమలకే పక్కా భవనాలు ఉన్నాయని, నూతన భవనాల నిర్మాణానికి రుణాలు మంజూరు చేయాలని కోరారు. సదస్సులో ఎస్‌బిఐ ఎఆర్ఎం ఎం.వి రామకృష్ణ, జీడి ఉత్పత్తిదారుల సంఘ అధ్యక్షులు రామేశ్వరం, రైస్ మిల్లర్ల సంఘం జిల్లా కార్యదర్శి కె.వి గోపాలకృష్ణ, పలాస పిసిఎంఎ కోశాధికారి కె.వి శివకృష్ణ, కార్యదర్శి పి.రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇఎంఐలపై వడ్డీలు వేయొద్దు

బ్యాంకర్లను కోరిన జెఎసి అమరావతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

లీడ్‌బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో ఉద్యోగులకు జీతాలు సకాలంలో చెల్లించడం లేదని, ప్రతి నెలా ఒకటో తేదీన చెల్లించే వరకు ఉద్యోగులు, పెన్షనర్లకు ఇఎంఐల వడ్డీపై వడ్డీ వేయొద్దని ఎపి జెఎసి అమరావతి జిల్లా అధ్యక్షులు కె.శ్రీరాములు బ్యాంకర్లను కోరారు. జెఎసి ఆధ్వర్యాన గురువారం బ్యాంకుల సందర్శన యాత్ర చేపట్టారు. అందులో భాగంగా నగరంలోని లీడ్ బ్యాంకు కార్యాలయాన్ని సందర్శించారు. లీడ్ బ్యాంకు మేనేజరు ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన జీతాలు, పెన్షన్లు కొన్ని నెలలుగా సకాలంలో చెల్లించలేకపోతుందని చెప్పారు. ఈ నేపథ్యంలో ఇఎంఐల వడ్డీపై వడ్డీలు వేయకుండా మానవతా దృక్పథంలో వెసులుబాటు కల్పించాలని కోరారు. బ్యాంకుల సందర్శన యాత్రలో జెఎసి అమరావతి అసోసియేట్ చైర్మన్ పి.లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి ఎస్.వి రమణ, రెవెన్యూ సర్వీసుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వేణుగోపాలరావు, కోశాధికారి జి.ఎల్.ఇ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

సంక్షేమ పాలనకు బంగారు బాటలు

పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

రాష్ట్రంలో సంక్షేమ పాలనకు సిఎం జగన్మోహన్‌రెడ్డి బంగారు బాటలు వేస్తున్నారని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని కొత్తపేటలో సర్పంచ్ అంబటి శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి కుటుంబానికీ ప్రభుత్వం నుంచి మేలు చేకూరుతుందన్నారు. అధికారంలోకి రావడానికి చంద్రబాబు మోసపూరిత మాటలు చెబుతున్నారని, ప్రజలు మళ్లీ మోసపోవడానికి సిద్ధంగా లేరని అన్నారు. జన్మభూమి కమిటీల ద్వారా టిడిపి సాగించిన అరాచకం ఇప్పటికీ ఎవరూ మరిచిపోలేదన్నారు. తీర ప్రాంతంలో పోర్టుతో పాటు షిప్పింగ్ హార్బర్ నిర్మాణం కూడా చేపడుతామన్నారు. దీంతో వేలాది మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. మంచినీలపేటలోని నిర్మాణం అవుతున్న ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌నూ పూర్తిస్థాయి ఫిషింగ్ హార్బర్‌గా అభివృద్ధి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి వైస్ ఛైర్‌పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాస్, ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, పిఎసిఎస్ ఛైర్మన్ దువ్వాడ మధుకేశవరావు, ఎంపిటిసి జి.మాకయ్య, మాజీ సర్పంచ్ అంబటి రాజులు, సర్పంచ్‌లు దున్న బాలరాజు, అట్టాడ గోపి, వరదరాజులు పాల్గొన్నారు.

23న జీడి రైతుల సదస్సు

సోంపేట : పలాసలో ఈ నెల 23న జీడి రైతుల సదస్సు నిర్వహిస్తున్నామని, దానిని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, వ్యవసాయ కూలీల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం మామిడిపల్లిలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. 80 కేజీల జీడి పిక్కల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించి, ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కర్రీ సింహాచలం, టి.రామారావు, పురుషోత్తం, కోటేసు, చినబాబు, ముకుందరావు, పాపారావు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

వంజరాపు రమణయ్యపైన మారణాయుధంతో దాడి చేసిన ముద్దాడ కన్నయ్యపై రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా నాయకులు ఆర్.సురేష్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారంపేటలోని భవన నిర్మాణ కార్మిక సంఘం భవనం నుంచి పోలీస్ స్టేషన్ వరకు భవన నిర్మాణ కార్మికులు నిందితుడు కన్నయ్యపై తగిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేస్తూ కుటుంబ సభ్యులు, భవన నిర్మాణ కార్మికుల నాయకులు గురువారం ప్రదర్శించారు. అనంతరం పోలీస్ స్టేషన్ వద్ద కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ పోలీస్ యంత్రాంగం చట్టబద్ధంగా నిందితుడిపై చర్యలు తీసుకోని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఇటీవల కాలంలో కార్మికులు, వారి కుటుంబ సభ్యులు హత్యలకు గురైన సందర్భాల్లో పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి కేసులను నీరుగార్చారన్న బాధను బాధితుల కుటుంబాలు వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. అనంతరం సిఐ డి.రాము, ఎస్ఐ సింహాచలంకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. సిఐ మాట్లాడుతూ డాక్టర్ రిపోర్టుల ఆధారంగా చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నరసన్నపేట భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు తర్ల లక్ష్మణరావు, కోశాధికారి తంగి వెంకటరావు, కమిటీ సభ్యులు రాజాపు తవుడు, వాన అప్పారావు, కొర్రాయి కృష్ణ పాల్గొన్నారు.

ఎస్ఐతో మాట్లాడుతున్న సురేష్‌బాబు

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 73వ జన్మదిన వేడుకలను గురువారం నగరంలో పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. భారీగా తరలివచ్చిన పార్టీ నాయకులు నగరంలోని ఏడు రోడ్డు కూడలి వద్ద ఉన్న ఎన్‌టిఆర్, ఎర్రన్నాయుడుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, కార్యదర్శి చిట్టి నాగభూషణం, పార్టీ నాయకులు మెండ దాసునాయుడు, జామి భీమశంకర్, సురకాశి వెంకటరావు, పి.ఎం.జె.బాబు, గొర్లె వెంకటరమణ పాల్గొన్నారు.

గొండు శంకర్ ఆధ్వర్యాన..

సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ ఆధ్వర్యాన చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా రిమ్స్‌లో చికిత్స పొందుతున్న రోగులకు పళ్లు, రొట్టెలు పంచిపెట్టారు. అలాగే పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆమదాలవలస : తెలుగుదేశం పార్టీ శ్రేణుల మధ్య పట్టణ శివారున ఉన్న ఓ ప్రయివేట్ కళ్యాణ మండపంలో టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ చంద్రబాబు నాయుడు 73వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కేకును కట్ చేసి అభిమానులందరికీ పంచిపెట్టారు. అనంతరం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 65 మంది యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ తమ్మినేని గీత, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షులు తమ్మినేని సుజాత, కణితి విజయలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు నూకరాజు, సనపల ఢిల్లేశ్వరరావు, తమ్మినేని విద్యాసాగర్, శివ్వాల సూర్యం, అంబళ్ల రాంబాబు, పల్లి సురేష్, బొడ్డేపల్లి గౌరీపతి, సనపల చెల్లంనాయుడు, గొండు రమణ, బోర గోవిందరావు, సంపతిరావు మురళి పాల్గొన్నారు.

కవిటి: కవిటిలో చంద్రబాబు జన్మదిన సందర్భంగా ఎమ్మెల్యే బెందాళం అశోక్ కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

పలాస : పలాస టిడిపి కార్యాలయంలో చంద్రబాబు జన్మదిన సందర్భంగా టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష కేక్‌ను కట్ చేశారు. అనంతరం పలాస ప్రభుతాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పళ్లు పంపిణీ చేశారు. కాశీబుగ్గ సాయిరాం మందిరం వద్ద అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు నాగరాజు నవీన్, కొవ్వూరు సురేష్ పాల్గొన్నారు.

నందిగాం : టిడిపి కార్యాలయంలో చంద్రబాబు జన్మదిన సందర్భంగా తెలుగు యువత అధ్యక్షులు తూలుకు మహేష్, సతీష్ కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం మండలంలోని కొండల ప్రాంతంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పి.అజయ్‌కుమార్, ఎం.బాలకృష్ణ, పోలాకి చంద్రశేఖరరావు, కొన్ని ప్రసాదరావు, అక్కురాడ కూర్మారావు, సబ్బి జానకిరావు, నందిగాం తిరుపతిరావు, సుదర్శనరావు, ముదిలి సింహాచలం, బర్ల కృష్ణయ్య పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక శ్రీచిదంబరేశ్వరస్వామి ఆలయంలో చంద్రబాబు జన్మదినం సందర్భంగా టిడిపి పట్టణ అధ్యక్షులు కాళ్ల ధర్మారావు, మాజీ ఎంపిపి దక్కత ఢిల్లీరావు కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో కాళ్ల జయదేవ్, డి.శ్రీను, డి.కామేశ్వరరావు, నందిగామ కోటేశ్వరరావు, ఎల్.పద్మనాభం, బి.ప్రసాద్, బి.లోహిదాస్, ఆర్.జాని, ఎ.రామకృష్ణ పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన 'ఎంజిఆర్'

పాతపట్నం : ప్రకాశం జిల్లా మర్కాపురం టౌన్ హాల్‌లో చంద్రబాబునాయుడుకు టిడిపి నాయకులు, వ్యాపార వేత్త మామిడి గోవిందరావు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు పుష్పగుచ్ఛం అందజేశారు.

నరసన్నపేట : వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన చంద్రబాబు జన్మదిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్ : టిడిపి కార్యాలయంలో చంద్రబాబు జన్మదిన సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం కొండములగాం పిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న రోగులకు రొట్టెలు, పళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు లెంక శ్యామలరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు గొర్లె లక్ష్మణరావు, పిసిని జగన్నాథంనాయుడు, బాలి శ్రీను, పిసిని అసిరినాయుడు, పైడి అప్పడుదొర, రౌతు శ్రీనివాసరావు, ముక్కు ఆదినారాయణ, దుమ్ము అశోక్ పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక కలమట కాంప్లెక్స్‌లో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్ చంద్రబాబు జన్మదిన సందర్భంగా సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులకు పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డి.కిషోర్‌కుమార్, సర్పంచ్‌లు లోతుగెడ్డ భగవాన్‌దాసునాయుడు, నాగళ్ల అప్పన్న, నెల్లి అచ్యుతరావు, మాతల గాంధీ, కులశేఖర్ ఆళ్వార్, చోడవరపు లోకేష్, అగతముడి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: కొత్తమ్మతల్లి ఆలయంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్ ఆధ్వర్యాన చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కేకును కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, పూజారి శైలజ, దేవాది సింహాద్రమ్మ, బాడాన రమణమ్మ, గొండు లక్ష్మణరావు, నంబాళ శ్రీనివాసరావు, కోరాడ గోవిందరావు పాల్గొన్నారు.

ఆమదాలవలస : కేక్‌ను తినిపిస్తున్న రవికుమార్

పలాస : అన్నదానంలో పాల్గొన్న గౌతు శిరీష

పాతపట్నం : పుష్పగుచ్ఛం అందజేస్తున్న గోవిందరావు

శ్రీకాకుళం అర్బన్ : ఎంపీకి కేక్‌ను తినిపిస్తున్న లక్ష్మీదేవి

కవిటి : కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

మోడీని గద్దె దించే వరకు పోరాటం

పలాస : పోస్టర్లను పంపిణీ చేస్తున్న నాయకులు

టెక్కలి రూరల్ : మండలంలోని మేఘవరం పంచాయతీ పరిధిలోని సరయాపల్లి, దెప్పూరు, కొదండపురం, పెద్దబీంపురం చిన్నబీంపురం గిరిజన గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టే కార్మికులు వద్ద సిపిఎం నాయకులు ప్రచార భేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు ఉపాధి కూలీలతో పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.ఎల్లయ్య మాట్లాడుతూ ప్రజలకు చెందిన ప్రకృతి సంపదులైన అడవులు, కొండలు, భూములు సహితం కేంద్ర బిజెపి ప్రభుత్వం అదాని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో శారద, బుజ్జమ్మ, దమయంతి, శాంతి, గీత పాల్గొన్నారు.

హిరమండలం : హిరమండలం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రచార భేరిలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, సిపిఎం సీనియర్ నాయకులు ఎం.అప్పారావు, రమణ, వెంకటరావు, కృష్ణ, రాము పాల్గొన్నారు.

పలాస : ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న మోడీ నిరంకుశ విధానాలను వ్యతిరేకించాలని సిపిఎం, సిపిఐ స్థానిక తిలక్‌నగర్, పరిసర వీధుల్లో ప్రచార భేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.ఢిల్లేశ్వరి, జె.భాగ్యలక్ష్మి, ఎం.లావణ్య, జ్యోతి పాల్గొన్నారు.

గార : ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బిజెపిని సాగనంపుదాం–దేశాన్ని కాపాడుకుందాం అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గంగరావు సింహాచలం పిలుపునిచ్చారు. గార మండలం వాడాడ, రెడ్డిపేట, అచ్చన్న పాలెం గ్రామాల్లో సిపిఎం, సిపిఐ పార్టీల ఆధ్వర్యాన ప్రచార బేరి నిర్వహించారు. ఈ మేరకు ఉపాధి పనుల వద్దకు వెళ్లి కూలీలతో పోస్టర్లను ఆవిష్కరించారు.

నగరంలో..

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని కిన్నెర సినిమా హాల్ ఏరియా, మొండేటి వీధి, మంగువారితోట, కంద్రవీధి, రంగిరీజువీధి, కాకివీధుల్లో సిపిఎం, సిపిఐ నాయకులు ప్రచార భేరి నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, సిపిఎం నగర కన్వీనర్ టి.తిరుపతిరావు, వామపక్ష నాయకులు డోల శంకరరావు, కె.భాస్కరరావు, ఎ.సోమశేఖర్, సిహెచ్.గోవిందరావు, ఎస్.శ్రీనివాసులు, కె.చంద్రశేఖర్, పి.ప్రభావతి, కె.శ్రీనివాసరావు, అప్పారావు పి.ప్రసాద్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధి కూలీలు

సోంపేట : దేశ సంపదను, ప్రభుత్వ రంగ పరిశ్రమలను, గనులను ఓడరేవులను అదానీ, అంబానీలకు కట్టబెడుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ సోంపేట మండల కేంద్రంలో ప్రచార భేరీ నిర్వహించారు. కార్యక్రమంలో సిపెం కార్యదర్శి సంగారు లక్ష్మీనారాయణ, సిపిఐ జిల్లా సమితి సభ్యులు సాలిన నారాయణస్వామి, పొందర చిరంజీవి, దున్న యామయ్య, కర్రి సింహాచలం, కామయ్య, జానకరావు, జి.తరణి పాల్గొన్నారు.

మామిడిపల్లిలో...

మండలంలోని మామిడిపల్లిలో ప్రచార భేరీ కార్యక్రమంలో భాగంగా ఎపి రైతు సంఘం, వ్యవసాయ కూలీల సంఘం ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో జుట్టు సింహాచలం, టి.రామారావు, జి.పురుషోత్తం, పి.రామారావు, కె.సింహాచలం, పి.కామరాజు పాల్గొన్నారు.

పిఒ కల్పనాకుమారిని సన్మానిస్తున్న ఎంపిపి సావిత్రి

రోడ్లు నిర్మించాలని వినతి

కొత్తూరు : మండలంలోని గిరిజన పంచాయతీ అడ్డంగి, అభలసింగి, గొట్టిపల్లి, కోటంగూడ గ్రామాలకు పక్కా రోడ్లను నిర్మించాలని వైసిపి నాయకులు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు కోరారు. ఈ మేరకు సీతంపేట ఐటిడిఎ పిఒ బి.కల్పనాకుమారిని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో గర్భిణులు, రోగులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వాహనదారులు అవస్థలు పడుతున్నారని, తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని వివరించారు. ఐటిడిఎ నిధుల నుంచి నిధులు మంజూరు చేసి తారు రోడ్డు నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. పిఒ స్పందిస్తూ... రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటా మని భరోసానిచ్చారు. అంతకుముందు పిఒను ఎంపిపి సవర సావిత్రి దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో అంపిలి ప్రశాంత్‌కుమార్, కొయిలాపు సంజీవరావు, సవర రమేష్‌లు పాల్గొన్నారు.

నియమక పత్రాన్ని అందజేస్తున్న ప్రిన్సిపాల్ జవహార్

జాబ్‌మేళాలో 65 మంది ఎంపిక

పలాస: డాక్టర్ కణితీస్ ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 65 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పైల జవహార్ తెలిపారు. కడపకు చెందిన షిర్డీ సాయి ఎలక్ట్రికల్ లిమిటెడ్ కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ జగన్నాథంనాయుడు ఆధ్వర్యాన ఈ జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాలో 120 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎడ్యుక్యూట్ అధికారులు శివ, రాజు, ప్లేస్‌మెంట్ అధికారులు దిలీప్‌కుమార్, రామ్మోహనచౌదరిలు పాల్గొన్నారు.

కేశవదాసుపురం మాజీ సర్పంచ్ మృతి

పొందూరు : మండలంలోని కేశవదాసుపురం మాజీ సర్పంచ్, టిడిపి సీనియర్ నాయకులు గాడు రాములు (75) గురువారం స్వగృహంలో అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఈయన 1984–89 మధ్య పంచాయతీ మొదటి సర్పంచ్‌గా పనిచేశారు. ఈయనకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వీరి కుమారుడు గాడు నారాయణరావు మాజీ సర్పంచ్‌గాను, ప్రస్తుతం టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులుగా పనిచేస్తున్నారు. అలాగే ఈయన కోడలు గాడు అనూరాధ కూడా సర్పంచ్‌గా పనిచేశారు. ఈయన మృతికి ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, మండల టిడిపి అధ్యక్షులు చిగిలిపల్లి రామ్మోహనరావు, నాయకులు అన్నెపు రాము, బలగ శంకరభాస్కరరావు, బాడాన శేషగిరినాయుడు, లోలుగు వెంకట్, వండాన మురళి, చింతాడ కృష్ణవాసుదేవరావు, పైడి వాసుదేవరావు, పైడి రామారావు, తదితరులు తమ సంతాపాన్ని తెలిపారు.

రాములు (ఫైల్)

బీమా సాయం అందజేత

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని నందిగామ పంచాయతీ కొండపేటదానికి చెందిన చిప్పాడ మోహనరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడు వైఎస్ఆర్ బీమాకు అర్హులు కావడంతో నామినీ అయిన భార్య హేమలతకు జిసిఎస్ మండల కన్వీనర్, సర్పంచ్ ప్రతినిధి జె.జయరాం తక్షణ ఆర్థికసాయం కింద రూ.పది వేలు గురువారం అందజేశారు. ఈయనతోపాటు వెల్ఫేర్ విద్యా సహాయకులు ఎ.నిరంజన్, వైసిపి నాయకులు బి.బాబూరావు, ఎ.నరసింహులు, నక్క కామేష్, జి.అప్పారావు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

ప్రజాశక్తి- రణస్థలం

రణస్థలం అగ్నిమాపక దళం ఆధ్వర్యాన నిర్వహించిన అగ్నిమాపక వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ మేరకు అగ్నిమాపక అధికారి పైలా అశోక్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరెంటెండెంట్ ఎం.వి. ప్రసాదరావు, వైద్యాధికారులు, ప్రభుత్వ పాఠశా లల ఉపాధ్యాయులు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. అనంతరం 'ఆస్కాలైట్', గ్యాస్ ప్రమాదాలపై 'డెమో' చేసి చూపించారు.

ఆమదాలవలస : అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆమదాలవలస : అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా పట్టణ శివారులో ఉన్న శ్రీహరిపురం అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక అధికారి కె.అప్పారావు ఆధ్వర్యాన వర్క్‌షాప్‌ను నిర్వహించారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది బొడ్డేపల్లి హరినాయుడు, ఎఎస్ఒ విజయలక్ష్మి, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక అగ్నిమాపక కేంద్రం వద్ద అగ్నిమాపక అధికారి జి.రమణమూర్తి విద్యార్థులకు, ఆశా కార్యకర్తలకు, అంగన్వాడీ కార్యకర్తలకు అగ్నిప్రమాదాలు జరిగిన తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్‌దాసునాయుడు, ఉప సర్పంచ్ పి.మణికంఠ, వాసు పాల్గొన్నారు.

పలాస : అగ్నిప్రమాదాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక ఎస్ఐ సోమేశ్వరరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక కేంద్రం వద్ద ప్రజలకు సిబ్బంది ఉపయోగించే పరికరాలను ప్రదర్శించారు. వాటిపై ప్రజలకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో భాస్కరరావు, యుగంధర్, ప్రేమ్‌కుమార్, మన్మథరావు, సంతోష్‌కుమార్‌లు పాల్గొన్నారు.

సాహిత్య సంబరాలకు 'తెప్పలకు' ఆహ్వానం

పలాస : తెలుగు వెలుగు జాతీయ సాహిత్య వేదిక, ఎస్‌వి ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో ఈ నెల 30న హైదరాబాద్‌లో జాతీయ సాహిత్య సంబరాలు నిర్వహించనున్నారు. ఈ సంబరాల్లో పాల్గొవాలని పలాసకు చెందిన సీనియర్ రచయిత, జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి ఆహ్వానం అందింది. ఆయన రచించిన 'మన సంస్కృతి – సంప్రదాయాలు' కవితా సంకలనానికి ఎంపిక చేశామని, జాతీయ సాహిత్య సంబరాల సందర్భం గా విడుదల చేసే సంకలనంలో కవితను ప్రచురిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలి

దీక్ష చేస్తున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి- కవిటి

కవిటిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు కవిటి బస్టాండ్‌లో గురువారం ఒకరోజు నిరాహార దీక్ష చేశారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఆయన దీక్ష సాయంత్రం ఐదు గంటలకు ముగిసింది. స్థానిక ఎమ్మెల్యే బెందాలం అశోక్, మండల పరిధిలోని యువకులు, స్థానికులు జనసేన దీక్షకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కవిటిలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు 2014లో ఎన్నికల హామీగా చెప్పారని గుర్తు చేశారు. కానీ, ఇప్పటి వరకూ ఆ విషయమే మరిచిపోయారని ఎద్దేవా చేశారు. భావితరాలకు ఉన్నత విద్య అందించాలంటే కవిటిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అవసరమన్నారు. ఇప్పటికైనా డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోకపోతే తమ పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బెట్కపల్లి ఈశ్వరరావు, రాష్ట్ర మత్స్యకార వికాస విభాగ కార్యదర్శి నాగుల హరి బెహరా, దుర్గాసి నీలవేణి, డొక్కరి శారద ఈశ్వర్, రోకళ్ల భాస్కర్, దాసరి శేఖర్ పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ అందజేత

ప్రజాశక్తి- రణస్థలం

స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఎచ్చెర్ల మండలం పాతకూర్మినాయుడుపేటకు చెందిన జీరు సాయిలక్ష్మి బాధిత కుటుంబ సభ్యులకు రూ.15 లక్షలు చెక్కును మ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలు ఆపదలో ఉంటే సిఎం ఆదుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు జీరు రామారావు, వెంకటరెడ్డి, దుంప చిన్నారెడ్డి, జీరు అయ్యప్పరెడ్డి, తిరుమరెడ్డి సత్యనారాయణ, ఆబోతుల నరసింహమూర్తి, కిల్లారి సూర్యనారాయణ పాల్గొన్నారు.

రణస్థలం : చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలోని నందిగాం మండలం కొండతెంబూరుకు చెందిన రజశ్రీకి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అందజేశారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బాధిత కుటుంబ సభ్యులు కడుమ అన్నపూర్ణకు చెక్కును అందజేశారు. అలాగే టెక్కలికి చెందిన తనకుమారుని అంతుచిక్కని వ్యాధితో బాధపడుతు న్నాడని, ఆదుకోవాలని తండ్రి వెంకటరావు ఇటీవల అభ్యర్థించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.5 లక్షల చెక్కును అందజేశారు. అలాగే టెక్కలి మండలం లింగాలవలసకు చెందిన ఎస్.అప్పారావు కుమారుడు సామదిలీప్ కుమార్ పుట్టుకతోనే మూగ, చెవుడు అని, తనకు జీవనాధారం కల్పించాలని ఇటీవల అభ్యర్థించారు. ఈయనకు సిఎం సహాయ నిధి కింద రూ.2 లక్షల చెక్కును అందజేశారు.

శ్రీకాకుళం అర్బన్ : చెక్కును అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

సైన్స్ టాలెంట్ టెస్టుకు స్పందన

ఇచ్ఛాపురం : స్థానిక జ్ఞానభారతి పాఠశాలలో సిబిఎస్ఇ సైన్స్ టాలెంట్ టెస్టు పరీక్షలు గురువారం నిర్వహించారు. జ్ఞానభారతి పాఠశాల కార్యదర్శి జనాబ్ జోహార్ ఖాన్ అధ్యక్షతన పాఠశాల ఆవరణలో 8 నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 120 మంది సిబిఎస్ఇ విద్యార్థులు సైన్స్ టాలెంట్ టెస్టు పరీక్ష రాశారు. ఈ సందర్భంగా ఖాన్ మాట్లాడుతూ ఇటువంటి టాలెంట్ టెస్టు పరీక్షల ద్వారా విద్యార్థుల్లో విద్యాభివృద్ధికి మరింత దోహదం చేస్తాయని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వి.రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.బి.పండా, హెచ్‌ఎం రషీదా సుల్తానా, ఎఒ ప్రేమ్ సర్తాజ్ ఖాన్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

పరీక్ష రాస్తున్న విద్యార్థులు

భార్య లేని లోకంలో జీవించలేను

మనస్తాపంతో ఆర్మీ ఉద్యోగి ఆత్మహత్య

ప్రజాశక్తి- పొందూరు

ఏడాది క్రితం వివాహం కాగా... భవిష్యత్‌పై ఎన్నో కలలు కన్నారు... గర్భిణీగా ఉన్న భార్య అనారోగ్యానికి గురికావడంతో సెలవుపై హుటాహుటిన వచ్చి విశాఖలోని మిలటరీ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఇంతలో మూర్చ రూపంలో పరిస్థితి విషమించి ఈ నెల 16న ఆమె మృతి చెందింది. అప్పటి నుంచి తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. భార్య లేని లోకంలో జీవించలేనని నిర్ణయించుకున్నాడు. అనారోగ్యంగా ఉందని, ఆస్పత్రికి వెళ్తునని చెప్పి పొందూరు మండలం కొంచాడ వద్ద మర్రిచెట్టుకు ఉరేసుకుని ఆమదాలవలస మండలంలోని ఈశర్లపేటకు చెందిన ఆర్మీ ఉద్యోగి మంగరాజు రాజుబాబు (27) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు రాజుబాబు 2016లో ఆర్మీ ఉద్యోగంలో చేరారు. ఈయనకు 2022 ఫిబ్రవరిలో అదే గ్రామానికి చెందిన మౌనికతో వివాహమైంది. మౌనిక ఏడు నెలల గర్భిణి అయిన ఆమె అనారోగ్యానికి గురైంది. వెంటనే ఆమెను విశాఖలోని మిలటరీ ఆస్పత్రిలో కుటుంబ సభ్యులు చేర్పించి రాజుబాబుకు సమాచారం ఇచ్చారు. ఆయన సెలవుపై వచ్చారు. మౌనిక చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఈ నెల 16న ఆమె మృతి చెందింది. అప్పటి నుంచి మానసికంగా బాధపడుతూ అనారోగ్యానికి గురయ్యాడు. ఈ నెల 19న ఆస్పత్రికి వెళ్తానని చెప్పి రైలు ఎక్కి పొందూరు రైల్వేస్టేషన్‌లో దిగిపోయాడు. భార్య లేని తాను జీవించలేనని తాను చనిపోతానని స్నేహితులకు మెసేజ్ చేయడంతో ఆందోళన చెంది వెంటనే 100కు సమాచారం ఇచ్చారు. వెంటనే కుటుంబ సభ్యులు, స్నేహితులు పొందూరు వచ్చి రైల్వేస్టేషన్ పరిసరాల్లో వెతకడంతో రాత్రి 11 గంటల సమయంలో మర్రి చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. విగతజీవుడై వేలాడుతున్న కొడుకును చూసి తల్లిదండ్రులు సత్యనారాయణ, సత్యవతిలు తీవ్రంగా రోదించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి శవపంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దీంతో మృతుడు స్వగ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

చెట్టుకు ఉరి వేసుకున్న రాజుబాబు

బైక్‌పై నుంచి జారి పడి మృతి

పొందూరు: మండలంలోని కృష్ణాపురం వద్ద కొంచాడకు చెందిన ముద్దాడ రమణమ్మ (58) బైక్ పైనుంచి జారిపడి మృతి చెందింది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కుమారుడు కృష్ణతో కలిసి బుధవారం బైక్‌పై చిలకపాలెం నుంచి గ్రామానికి వస్తున్నారు. కృష్ణాపురం రమణమ్మ బైక్ పైనుంచి జారిపడి పడిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో 108లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడింది. ఈమెకు ఇద్దరు కుమారులు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివరాలు సేకరిస్తున్న కూర్మారావు

జగనన్న గోరుముద్ద పరిశీలన

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు రోజు వారీ అందిస్తున్న జగనన్న గోరుముద్ద పథకం ద్వారా రోజూ మధ్యాహ్నం అందిస్తున్న భోజనంలో పిల్లల పెరుగుదలకు, బుద్ధి వికాసానికి, రక్తహీనత లేకుండా ఆరోగ్యంగా ఉండేందుకు ఉపయోగపడుతుందని మండల విద్యా సంక్షేమ అధికారి, ఎపిఎం పైడి కూర్మారావు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డు తిమ్మాపురం ప్రాథమిక పాఠశాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద పథకం ద్వారా అక్షయపాత్ర సంస్థ అందిస్తున్న మధ్యాహ్న భోజనం గురించి ఉపాధ్యాయులతో, పిల్లలతో మాట్లాడారు. కొంతమంది పిల్లలు స్కూల్‌లో తినడం లేదని గుర్తించారు. తినక పోవడానికి గల కారణాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా పెరుగుదలకు సంబంధించి అవసరమైన దినుసులు ఉండేటట్లు పెడుతున్న పౌష్టికాహారాన్ని పిల్లలందరూ తినేటట్లు తల్లిదండ్రులకు సమావేశం పెట్టి అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. జగనన్న విద్యా కానుక పేరుతో పిల్లలకు యూనిఫారాలు, పాఠ్య, నోట్ పుస్తకాలు, బెల్టు, బూట్లు, స్కూల్ బ్యాగ్, ఇంగ్లీష్, తెలుగు డిక్షనరీ ప్రభుత్వం పిల్లలకు అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పొన్నాడ సౌజన్య, ఉపాధ్యాయులు బొడ్డేపల్లి మల్లేశ్వరి, జి.పాల్‌బాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ

తాగునీటి సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జలజీవన్ మిషన్ ఆధ్వర్యాన గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తొమ్మి నెలల పాటు తాగునీటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం 'క్యాచ్‌ది రైన్ 'పేరిట' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వి.సత్యనారాయణ తెలిపారు. కళాశాలలో గురువారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తొమ్మిది నెలల పాటు నిర్వహించే ఈ అవగాహనా కార్యక్రమాల ద్వారా భూగర్భ జలాల సంరక్షణతో పాటు వర్షపు నీటిని ఒడిసిపట్టి ఆదా చేసేందుకు దోహదపడుతుందన్నారు. ప్రతి విద్యార్థీ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.ప్రమీల, డాక్టర్ వై.పోలినాయుడు, శ్రీరామ్మూర్తి, రవిబాబు, అరుణకుమారి, పావని, భౌతికశాస్త్ర విభాగధిపతి డాక్టర్ జైపాల్‌రావు, వృక్ష శాస్త్ర విభాగధిపతి డాక్టర్ రామారావు, గణిత శాస్త్ర విభాగపతి రవిశంకర్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న మోహనరావు

కుక్కల నుంచి రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని వీధి కుక్కల నుంచి ప్రజలను రక్షించాలని సిటిజన్ ఫోరం ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి మోహనరావు కోరారు. గురువారం మున్సిపల్ కమిషనర్ ఎం.రవి సుధాకర్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని రైల్వే స్టేషన్ కూడలి, ప్రధాన రహదారుల్లో గుంపులు గుంపులుగా కుక్కలు చేరి బాటసారులను, వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని అన్నారు. ఇటీవల గేటు, పాత ఆమదాలవలస, కుద్దిరాం, మెట్టక్కివలసలలో కుక్క కాటుకు గురై పలువురు ఇబ్బందులకు గురయ్యారు. కోడి, గొర్రెల మాంసం విక్రయాలు రోడ్లపైనే నిర్వహిస్తుండడంతో వ్యర్థాలను తినేందుకు కుక్కలు గుంపులుగా చేరుతున్నాయని వివరించారు. వినతిపత్రం అందించిన వారిలో సిటిజన్ ఫోరం అధ్యక్షులు జె.జె.మోహనరావు, సచివాలయాల కో-ఆర్డినేటర్ అల్లం శెట్టి ఉమామహేశ్వరరావు ఉన్నారు.

గౌతు శిరీష పరామర్శ

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ ఆంధ్రజ్యోతి విలేకర్ హరి తల్లి లాలెమ్మ, మండలంలోని సవరగోవిందపురానికి చెందిన సవర సుసాంత్ ఇటీవల పెద్దమడి గురుకుల పాఠశాలలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయా కుటుంబ సభ్యులను టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష మృతుల కుటుంబాలను గురువారం పరామర్శించారు. ఆమెతో పాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, నాగరాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న గౌతు శిరీష

వైసిపి గొప్పల ప్రభుత్వం

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రచారం, గొప్పలు చెప్పడం తప్ప అభివృద్ధి జాడలేదని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. పట్టణంలోని 14వ వార్డు ఐ.జె.నాయుడు కాలనీలో గురువారం రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పాలన వల్ల రాష్ట్రం 30 ఏళ్ల అభివృద్ధికిలో వెనక్కి వెళ్లిపోయిందన్నారు. విద్యుత్, ఆస్తి, ఆర్‌టిసి ఛార్జీలను పెంచి ప్రజలను నిట్ట నిలువునా ముంచేశారని విమర్శించారు. కార్యక్రమంలో జగనన్న విద్యా కానుక లో ఇచ్చిన బ్యాగు ఎలా ఉందని ఓ విద్యార్థిని ప్రశ్నించారు. సాయంత్రానికే చిరిగిపోయిందని ఆ విద్యార్థి బదులు ఇవ్వడంతో నాణ్యతలేని వస్తువులను

ఆమదాలవలస : ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

విద్యార్థులకు ఇచ్చి గొప్పలు చెప్పడమే ప్రభుత్వ విధానమని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా తయారు చేసి ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ తమ్మినేని గీత, టిడిపి పట్టణ అధ్యక్షుడు సంపదరావు మురళి, వార్డు ఇన్‌ఛార్జి కూన రాము, మాజీ కౌన్సిలర్ కూన చిన్నమ్మడు, తమ్మినేని విద్యాసాగర్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: వైసిపి పాలనలో పెరిగిన ధరలు తగ్గాలంటే రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బోయిన రమేష్ అన్నారు. మండలంలోని హరిశ్చంద్రపురం పంచాయతీలో రాష్ట్రానికి ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పూజారి శైలజసత్యనారాయణ, మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, పూజారి శైలజ, దేవాది సింహాద్రమ్మ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి

సంతబొమ్మాళి : వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ భూషణరెడ్డి

సంతబొమ్మాళి : మండలంలోని నరసాపురం పంచాయతీ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని సర్పంచ్ దుక్క భూషణరెడ్డి సిఎం జగన్మోహన్‌రెడ్డిని కోరారు. ఈ నెల 19న సిఎం ములపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి శంకుస్థాపనకు వచ్చారు. ఈ మేరకు సిఎంను మర్యాదపూర్వకంగా కలిసి నిధులు మంజూరుకు వినతిపత్రం అందజేశారు. సిఎం స్పందిస్తూ... నిధులు మంజూరు చేయాలని పక్కనే ఉన్న కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారని సర్పంచ్ తెలిపారు. దీంతో సిఎం కృతజ్ఞతలు తెలియజేశారు.

కోటబొమ్మాళి: మండలంలో గడిచిన 40 ఏళ్లుగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోక ఇబ్బందులు పడుతున్న పంచాయతీల్లో శ్రీజగన్నాధపురం పంచాయతీ ఒకటని, ఈ పంచాయతీ అభివృద్ధికి రూ.కోటి మంజూరు చేయాలని వైసిపి మండల పార్టీ అధ్యక్షులు నూక

కోటబొమ్మాళి : వినతిపత్రం అందజేస్తున్న సత్యరాజు

సత్యరాజు కోరారు. బుధవారం సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు నిర్మాణం శంకుస్థాపనకు వచ్చిన సిఎం జగన్మోహన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ పంచాయతీ పరిధిలో రామచంద్రపురం వద్ద వంశధార కాలువపైన, అమ్మవారిగెండపై వంతెనలను నిర్మించాలని కోరారు. సిసి రోడ్లు, డ్రెయినేజీలు నిర్మాణాలకు, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని విన్నవించారు.

ముస్లిములకు ఇఫ్తార్ విందు

మెళియాపుట్టి : ఇఫ్తార్ విందు ఇస్తున్న చైతన్య

ప్రజాశక్తి- పలాస

పలాస జామియా మసీదులో రంజాన్ నేపథ్యంలో ముస్లిములకు మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఇఫ్తార్ విందును గురువారం రాత్రి ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముస్లిములు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మంత్రి వారితో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులతో కలిసి విందును ఆరగించారు. ఈ సందర్భంగా మంత్రి ముస్లిం వేషధారణలో కనిపించారు. ముస్లిములను సన్మానించి, వారికి రంజాన్ మాస శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ ఛైర్మన్ మీసాల సురేష్‌బాబు, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావుచిట్టి,

పలాస : ఫలహారాలను అందజేస్తున్న మంత్రి అప్పలరాజు

కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : రంజాన్ మాసంలో భాగంగా మండలంలోని పట్టుపురంలో ఉమ్మెశో మసీద్‌లో పాతపట్నం నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు గేదెల చైతన్య ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు గురువారం రాత్రి ఇచ్చారు. జనసేన నాయకులు దుక్క బాలరాజు, పిట్ట హరికృష్ణ, సయ్యద్ లాలూ ,సంపతిరావు, మాధవరావు, చింతల ప్రశాంత్, పడాల కార్తీక్, మణికంఠ, గణేష్, సవర రామ్మూర్తి, సందీప్ పాల్గొన్నారు.

వైభవంగా తిరువీధి ఉత్సవం

ఇచ్ఛాపురం : గ్రామ దేవత సంబరాలు సందర్భంగా పురవీధిలో గురువారం తిరువీధి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలు కరణంవీధి, కస్పా కూడలి, మహంతివీధి, గౌడో, జాలరి, అమీర్‌ఆలీ రోడ్డు, బుగత, రంగాల, బొబ్బిలి వీధి, నీలకంఠం వీధుల్లో తిరువీధి ఉత్సవాలు సాగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపర్లను ఆకట్టుకున్నాయి. నాలుగు రోజులుగా అమ్మవారి తిరువీధి కార్యక్రమం ఘనంగ నిర్వహించారు. ముందుగానే నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం వీధిలో ప్రజలు రంగురంగుల ముగ్గులు వేసి అమ్మవారికి ఆహ్వానం పలికారు. తిరువీధి సందర్భంగా ఆలయాభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసిన సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్సీ నర్తు రామారావు పాల్గొన్నారు. సిఐ ఈశ్వర్ చంద్రప్రసాద్, టౌన్ ఎస్ఐ గోవిందరావు అధ్వర్యాన పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

అమ్మవారిని ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు

అమ్మవారికి ఆరడుగుల అగరబత్తి

పట్టణంలో జరుగుతున్న గ్రామ దేవత సంబరాలు సందర్భంగా ఉప్పల వీధి ఉత్సవ మండపం వద్ద ఆరు అడుగుల అగరబత్తిని వెలిగించారు. ఎన్.రంగారావు అండ్ సన్స్ గ్రూప్‌కు చెందిన సైకిల్ బ్రాండ్ అగర బత్తి కంపెనీ శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారికి రూ.3,750 విలువైన ఆరు అడుగుల ఎత్తు గల ఆగరబత్తిని సమర్పించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు ఈశ్వరరావు, అచ్యుతరావు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు అడ్డగింత

పొందూరు: మండలంలోని కొంచాడ పంచాయతీ పరిధిలోని రైల్వేస్టేషన్ రహదారిని ఆనుకుని అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను తహశీల్దార్ రాంబాబు ఆదేశాలు మేరకు రెవెన్యూ, సర్వే అధికారులు గురు వారం అడ్డుకున్నారు. రహదారికి ఆనుకుని ఉన్న ఆర్ ఎండ్‌బికి చెందిన సర్వే నంబరు 49, 50ల్లో రహదారి స్థలాలను ఆక్రమించి అక్రమంగా నిర్మాణాలను చేపడు తున్నారని సర్పంచ్ పి.అనూరాధ తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు వెళ్లి అక్రమ నిర్మాణాలను

పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

పరిశీలించి నిర్మాణాలను చేపట్టరాదంటూ తెలియజేశా రు. అక్కడ నిర్మాణం చేపడుతున్న స్థలానికి సంబంధించి అనుమతి పత్రాలు ఉంటే చూపించాలని సూచించారు. అక్రమంగా నిర్మాణాలు జరిపితే కేసులు నమోదు చేయడంతో పాటు ఆ నిర్మాణాలను కూల్చివేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాధ, సర్వేయర్ ప్రసాద్, విఆర్ఒలు సాయి, రేవతిరావు పాల్గొన్నారు.

స్పీకర్ సీతారాంను అభినందిస్తున్న పాస్టర్లు

స్పీకర్‌ను కలిసిన పాస్టర్లు

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్ర వ్యాప్తంగా ఐదు వేల మంది పాస్టర్లకు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం గౌరవ వేతనం అమలు చేస్తూ... మాటమీద నిలబడిన వ్యక్తి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. క్రైస్తవ చర్చి పాస్టర్లకు బాసటగా నిలుస్తూ చేదోడు వాదోడు పథకం అమలు చేయడంతో పాస్టర్లు సిఎంకు కృతజ్ఞతలు తెలపాలని పోస్టర్లు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కరోనా కష్టకాలంలో తమకు ఆర్థిక చేయూత అందించేలా ముఖ్యమంత్రి చొరవ చూపారని అన్నారు. ప్రతినెలా రూ.5 వేలు గౌరవ వేతనం అందిస్తూ తమ కుటుంబాలకు ఆర్థిక చేయూతను అందించారన్నారు.

కలెక్టర్ పరామర్శ

లావేరు : లావేరు గ్రామానికి చెందిన శ్రీకాకుళం తహశీల్దార్ నిదిగంట్ల వెంకటరావును కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ గురువారం పరామర్శించారు. వెంకటరావు తల్లి దుర్గమ్మ, భార్య పద్మజలు ఒకే రోజు గంటల వ్యవధిలో మృతి చెందిన విషయం విధితమే. విషయం తెలుసుకున్న కలెక్టర్ లావేరుని వెంకటరావు స్వగృహానికి వెళ్లి పరామర్శించి సంతాపాన్ని, సానుభూతిని తెలిపారు. ముందుగా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈయన వెంట తహశీల్దార్ సాధు దిలీప్‌కుమార్, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు త్రినాథరావు ఉన్నారు.

పరామర్శిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ గిరిబాబు

బాధితులను ఆదుకుంటాం

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ భగవతి థియేటర్ సమీపంలో ఉన్న ఎలక్ట్రికల్ బైక్ షోరూం, పెయింట్స్ దుకాణంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాద బాధితులను మున్సిపల్ ఛైర్మన్ బల్ల గిరిబాబు గురువారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే మంత్రి అప్పలరాజు దృష్టికి తీసుకెళ్లి తనవంతు వంతుగా, ప్రభుత్వపరంగా సహాయ, సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈయన వెంట వైస్ ఛైర్మన్ మీసాల సురేష్, వార్డు కౌన్సిలర్ బెల్లాల శ్రీనివాసరావు, డబ్బీర్ నాగు ఉన్నారు.

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో తిలక్‌నగర్‌లో ఆంధ్రజ్యోతి పత్రిక విలేకరి హరి తల్లి లాలెమ్మ ఇటీవల మృతి చెందడంతో విషయం తెలుసుకున్న ఛైర్మన్ గిరిబాబు, తహశీల్దార్ ఎల్.మధుసూదనరావు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వైస్ ఛైర్మన్ మీసాల సురేష్‌బాబు, డబ్బీర్ నాగు, కౌన్సిలర్ బెల్లాల శ్రీనివాసరావు ఉన్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్ లక్ష్మణరావు

పంచాయతీ అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి- కవిటి

పంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ పంచాయతీలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నానని అన్నారు. తాగునీరు, రహదారులకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించినట్టు తెలిపారు. వేసవి తీవ్రత దృష్ట్యా తాగునీటికి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశామని, ఇప్పటికే గ్రామాల్లో మరమ్మతులకు గురైన బోర్లు సరిచేసినట్టు చెప్పారు. అనంతరం పంచాయతీలో జరిగిన ప్రగతి, స్థానిక సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ డి.కుమారి, ఎంపిటిసిలు పి.నీలాచలం, మానెక్ శంకర్, డి.హేమలత, కో-ఆప్షన్ మెంబర్ పి.శేఖర్, ఇఒపిఆర్‌డి శివాజి పాణిగ్రహి, ఇఒ వీరభద్రస్వామి పాల్గొన్నారు.

ఒఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న గోపయ్య

ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ

ప్రజాశక్తి- కవిటి

వేసవి తీవ్రత దృష్ట్యా ఉపాధి హామీ పనులు చేసేవారు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని వైస్ ఎంపిపి కర్రి గోపయ్య అన్నారు. ఎపి విపత్తుల నిర్వహణ సంస్థ ఆదేశాల మేరకు మండలంలోని పెద్దకర్రివానిపాలెంలో గోనామరిగెడ్డ గట్టు పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు, గ్రామస్తులకు వైస్ ఎంపిపి గోపయ్య, స్థానిక ఆశా కార్యకర్త వడదెబ్బపై అవగాహన కల్పించారు. ప్రతివ్యక్తీ తప్పనిసరిగా మూడు లీటర్లు నీటిని తీసుకోవాలని, ఎండ నుంచి రక్షణగా తలకు టోపీ ధరించాలని సూచించారు. అలసటగా ఉన్నప్పుడు స్థానిక ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. అనంతరం ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బెజ్జిపుట్టుగ పంచాయతీ కన్వీనర్ దీనబంధు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

వైద్య శిబిరానికి స్పందన

మెళియాపుట్టి : మండలం గొడ్డూరులో విద్యావేత్త, పాతపట్నం నియోజకవర్గ నాయకులు సిరిపురం తేజేశ్వరరావు అధ్యక్షతన శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రి సహకారంతో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గొడ్డూరు, రింపి, పడ్డ, నేలబొంతు, గొట్టిపల్లి, ముత్యాలబొంతు, డబారు, పడ్డ, ఇళ్లయపురం, అంజలాపురం 160 మందికి రోగులు తరలివచ్చారు. వీరికి బిపి, ఇసిజి, సుగర్ పరీక్షలను వైద్య సిబ్బంది నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గొడ్డూరు సర్పంచ్ ప్రతినిధి పెద్దబొంతు అప్పారావు, పెద్దబొంతు కైలేష్, సరాలి సర్పంచ్ పడాల షణ్ముఖరావు, దారపు గోవిందరావు, లింగాల వెంకట కృష్ణారావు, ఎఎన్‌ఎం సంతోషి, ఆశా వర్కర్ దాలమ్మ, నీలవేణి, సునీత, జ్యోతి పాల్గొన్నారు.